
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
10-03-2026 (Tuesday) MAIN EDITION

## చమురు ఆంక్షలపై ట్రంప్ కీలక నిర్ణయం




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలను తగ్గించడానికి చమురు ఉత్పత్తి చేసే దేశాలపై కొన్ని ఆంక్షలను ఎత్తి వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు ట్రంప్ ఓకే చెప్పారు. ఆ దేశంపై గతంలో విధించిన ఆంక్షలు ఎత్తి వేసినట్లు ప్రకటించారు. కొన్ని దేశాలపై తమ ఆంక్షలు ఉన్నాయని, యుద్ధం సద్దుమణిగే వరకు ఆ ఆంక్షలను ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

## ఉద్యోగుల జీతాల్లో కోత.. పాక్ కీలక నిర్ణయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చమురు ధరల పెరుగుదలతో ఆ దేశం కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధంతో చమురు ధరలు పెరుగుతుండడంతో దేశంలో ఇంధనాన్ని ఆదా చేసే లక్ష్యంతో పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సోమవారం కీలక సమావేశం నిర్వహించారు. రెండు నెలల పాటు ప్రభుత్వ వాహనాలకు ఇంధన కేటాయింపును 50 శాతం తగ్గించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఈ కాలంలో 60 శాతం ప్రభుత్వ వాహనాలు పనిచేయడం మానేస్తాయన్నారు.

## సీఎం అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ భేటీ



అక్షరటుడే, ఏపీ: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు హాజరయ్యారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, జీవోఎంల నిర్ణయాలు, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు.

## ప్రభాకర్ రావుకు రెగ్యులర్ బెయిల్



అక్షరటుడే, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం జరిగింది. కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు మంగళవారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అయితే విచారణకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది.

## లాభాలతో ముగిసిన స్టాక్‌మార్కెట్లు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశీయ స్టాక్‌మార్కెట్లు మంగళవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 639 పాయింట్లు, నిఫ్టీ 223 పాయింట్ల లాభంతో సూచీలు క్లోజ్ అయ్యాయి. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం, ఆసియా మార్కెట్లు కోలుకోవడం, రూపాయి విలువ మళ్లీ బలపడడం మార్కెట్లకు కలిసివచ్చింది. దీంతో మార్కెట్లు లాభాలతో క్లోజ్ అయ్యాయి.

**దేశంలో గ్యాస్ కొరత నెలకొనకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఎల్‌పీజీ సరఫరాపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. సామాన్యులకు గ్యాస్ అందుబాటులో ఉండేలా.. బ్లాక్ మార్కెట్‌కు సిలిండర్లను తరలించకుండా చర్యలు తీసుకుంది. వాణిజ్య సిలిండర్లకు బదులుగా.. గృహ అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. దీంతో గ్యాస్ సరఫరా కాక దేశంలోని పలు ప్రాంతాల్లో హోటళ్లు మూతపడ్డాయి.** —అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# గ్యాస్ సరఫరాపై ఎస్మా



- **ఎల్‌పీజీ కొరత అధిగమించేందుకు.. కేంద్రం కీలక చర్యలు**
- **గృహ అవసరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం**

ఇరాన్ యుద్ధంతో గ్యాస్ సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే. హర్మూజ్ జలసంధిని మూసి వేయడంతో గ్యాస్, ముడి చమురు రవాణా నిలిచిపోయింది. దీంతో గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అత్యవసర వస్తువుల చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. గృహావసరాలకే గ్యాస్ వినియోగించేలా.. ఎల్పీజీ పక్కదారి పట్టకుండా ఆంక్షలు అమలు చేయనుంది. వంట గ్యాస్ సరఫరాకు హామీ ఇవ్వడానికి కేంద్రం నిత్యావసర వస్తువుల చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని గరిష్ట స్థాయికి పెంచాలని, కీలకమైన హైడ్రోకార్బన్ ప్రవాహాలను ఎల్‌పీజీ పూల్‌లోకి మళ్లించాలని చమురు శుద్ధి కర్మాగారాలు, పెట్రోకెమికల్ యూనిట్లను ఆదేశించింది.

### దిగుమతులపై ఆధారం

భారత్ గ్యాస్ కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధార పడుతుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 31.3 మిలియన్ టన్నుల LPGని వినియోగించగా.. దేశంలో 12.8 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి అయింది. మిగిలిన అవసరాన్ని దిగుమతుల ద్వారా తీర్చారు. దిగుమతుల్లో 85 నుంచి 90 శాతం వరకు సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి వచ్చాయి. అయితే అక్కడి నుంచి సరుకు రవాణా హర్మూజ్ జలసంధి నుంచి రావాల్సి ఉంది. ప్రస్తుతం ఇరాన్ ఈ మార్గాన్ని మూసివేయడంతో గ్యాస్ సరఫరాకు అంతరాయం నెలకొంది. దీంతో కేంద్రం చర్యలు చేపట్టింది.

### డొమెస్టిక్ అవసరాలకే..

ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రమే ఎల్‌పీజీ ఉత్పత్తి చేయాలని కేంద్రం పేర్కొంది. రిఫైనర్లు పెట్రోకెమికల్స్ తయారీకి ప్రొపేన్, బ్యూటేన్‌ను ఉపయోగించడాన్ని నిషేధించింది. ఎల్‌పీజీని వంట ప్రయోజనాల కోసం గృహాలకు మాత్రమే విక్రయించాలి. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కేంద్రం తెలిపింది. కాగా ఇప్పటికే వాణిజ్య సిలిండర్లపై ఆంక్షలు విధించిం ది. చెన్నై, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో హోటళ్లు మూతబడ్డాయి. మరిన్ని హోటళ్లు మూతపడే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



## టీమిండియాకు బీసీసీఐ భారీ నజరానా..

**అక్షరటుడే, స్పోర్ట్స్‌డెస్క్:** టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు ప్రపంచ కప్ ఫైనల్‌లో అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జట్టుకు భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) రూ.131 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సొంతం చేసుకుంది. తొలుత బ్యాటర్లు చెలరేగడంతో 255 పరుగులు చేసింది. అనంతరం బౌలర్లు విజృంభించడంతో 159 పరుగులకే న్యూజిలాండ్ ఆలౌట్ అయింది. కప్ గెలిచిన సందర్భంగా బీసీసీఐ జట్టుకు రూ.131 కోట్లు నజరానా ప్రకటించింది. 2024లో రోహిత్ శర్మ నాయకత్వంలో గెలిచిన జట్టుకు రూ.125 కోట్ల ఇవ్వగా.. ప్రస్తుతం మరో రూ.6 కోట్లు అదనంగా ఇస్తున్నారు.

## అఫ్గాన్‌పై వైమానిక దాడులు అన్యాయం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ అఫ్గానిస్థాన్ మధ్య సరిహద్దు ఘర్షణలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో అఫ్గాన్‌పై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ ఖండించింది. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ ఈ మేరకు స్పందించారు. సరిహద్దుల్లో జరిగే హింస కారణంగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై సెక్రెటరీ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. 'అంతర్జాతీయ మానవతా వాదం, అంతర్జాతీయ చట్టాలను బాధ్యతాయుతంగా పాటించాలి.



## నూతన గవర్నర్‌కు స్వాగతం పలికిన రేవంత్‌రెడ్డి


**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా కుటుంబంతో సహా మంగళవారం హైదరాబాద్ చేరుకున్నారు. ఆయనకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. కేంద్రం ప్రభుత్వం ఇటీవల పలు రాష్ట్రాల గవర్నర్లను మార్చిన విషయం తెలిసిందే. తెలంగాణ గవర్నర్‌గా పని చేస్తున్న జిష్ణుదేవ్‌వర్మను మహారాష్ట్రకు పంపించింది. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను తెలంగాణకు నియమించింది. ఈ మేరకు ఆయన హైదరాబాద్ చేరుకున్నారు. నూతన గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనతో సీఎం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## ప్రీబడ్జెట్‌పై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష




**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రజల సంక్షేమం, ఉపాధి అవకాశాల పెంపు, పారిశ్రామిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని సమగ్ర బడ్జెట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర సచివాలయంలో కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనులు భూగర్భశాఖల ఉన్నతాధికారులతో ప్రీబడ్జెట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. బడ్జెట్ నేపథ్యంలో ఆయా శాఖల ప్రాధాన్యాలు, అమలులో ఉన్న కార్యక్రమాల పురోగతి, ఉపాధి అవకాశాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించామన్నారు. ఆర్థిక శాఖతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు బడ్జెట్‌కు సంబంధించిన ప్రతిపాదనలు, ప్రాధాన్య అంశాలను వివరించారు.

## లోక్‌సభ స్పీకర్ అవిశ్వాస తీర్మానంపై చర్చ



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానంపై మంగళవారం చర్చ ప్రారంభమైంది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. చర్చ కోసం 10 గంటలు కేటాయించారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ విపక్ష సభ్యులు కేసీ వేణుగోపాల్, అసద్ లేవనెత్తగా.. ప్యానెల్ స్పీకర్ జగదాంబిక పాల్ తిరస్కరించారు. కాంగ్రెస్ ఎంపీ మహమూద్ జావేద్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. చర్చ అనంతరం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లా డనున్నారు. స్పీకర్ స్థానంలో బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ కూర్చున్నారు. చర్చకు 10 గంటలు కేటాయించినట్లు చెప్పారు. తీర్మానానికి కట్టుబడి ఉండాలని ఎంపీలను కోరారు.

## లావణ్య త్రిపాఠికి సోషల్ మీడియాలో వేధింపులు



**టాలీవుడ్ హీరోయిన్, మెగా ఫ్యామిలీ కోడలు లావణ్య త్రిపాఠికి సోషల్ మీడియాలో వేధింపులు వచ్చాయి. దీంతో ఆమె హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నటి లావణ్య త్రిపాఠి పలు సినిమాలతో తెలుగులో గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఆమె నాగబాబు కుమారుడు, హీరో వరుణ్ తేజ్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే కొంతకాలంగా లావణ్యను ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఓ వ్యక్తి వేధిస్తున్నాడు. ఈ మేరకు నిందితుడిపై చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని, దూషణలకు పాల్పడిన పోస్టులను తొలగించాలని లావణ్య కోరారు. దీంతో పోలీసులు ఐటీ చట్టం సెక్షన్ 67, BNS 78,79 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.**

—అక్షరటుడే, సినిమాడెస్క్

## కల్వకుంట్ల కవిత అరెస్ట్..



**అక్షరటుడే, ఖమ్మం:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మంలో నిరాహార దీక్ష చేస్తున్న ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇటీవల పలువురి ఇళ్లను ప్రభుత్వం కూల్చి వేసిన విషయం తెలిసిందే. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కల్వకుంట్ల కవిత ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌తో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం రాత్రి దీక్ష ప్రారంభించారు. అయితే మంగళవారం తెల్లవారు జామున కవిత, విశారదన్‌తో పాటు నిరాహార దీక్ష చేపట్టిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం హైదరాబాద్‌కు తరలించారు.

## శ్రీలంకలో భారీగా పెరిగిన ఇంధన ధరలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచంలో చమురు సంక్షోభం తలెత్తుతోంది. హర్మూజ్ జలసంధి మూసివేత, ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తిని తగ్గించడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. దీంతో పలు దేశాలు పెట్రోలు, డీజిల్ ధరలను భారీగా పెంచాయి. శ్రీలంకలో పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి ధరల పెంపు అమలులోకి వచ్చింది. ఆక్టేన్ 92 పెట్రోల్ రూ.24 పెంచడంతో.. లీటర్ రూ.317కు చేరింది. ఆక్టేన్ 95 పెట్రోల్ రూ.25 పెంపుతో రూ.365కి, ఆటో డీజిల్ రూ.22 పెంపుతో లీటర్‌కు రూ.303 కు చేరింది. సూపర్ డీజిల్ ధరలను లీటర్‌కు రూ.24 పెంచింది.